సాక్షి వనపర్తి

గురువారం । 10 । అక్టోబర్ । 2024



కల్యాణ వైభోగమే..

అలంపూర్‌లో బుధవారం జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వరస్వామి కల్యాణం జరిగింది.

వివరాలు 10లో ▸



జూరాలకు తగ్గిన ఇన్‌ఫ్లో

జూరాల జలాశయానికి బుధవారం 22 వేల క్యూసెక్కుల వరద వచ్చింది.

వివరాలు 10లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
37.1 /21.8

వాతావరణం

ఆకాశం అప్పుడప్పుడు మేఘావృతం అవుతుంది. ఎండ ప్రభావం ఉంటుంది. మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.



నారాయణపేట జిల్లా మాగనూరు శివారులో ప్రభుత్వ అనుమతితో కొనసాగుతున్న ఇసుక తవ్వకాలు

ఇసుకలో రెవెన్యూ దందా..

- ఇసుక అక్రమ రవాణాలో రెవెన్యూ అధికారులు
- ప్రభుత్వ అనుమతుల పేరుతో ప్రైవేటు వ్యక్తులకు తరలింపు
- నిలిచిన ప్రభుత్వ ఇసుక వాహనం పథకం
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సర్కారు ఆదాయానికి గండి

'మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకుల మండలంలో పనిచేస్తున్న ఓ రెవెన్యూ ఉద్యోగి జిల్లాకేంద్రంలో నిర్మిస్తున్న ఇంటి వద్ద నిల్వ చేసుకున్న ఇసుక డంపు ఇది. ఇసుక అక్రమ రవాణాను కట్టడి చేయాల్సిన అధికారులే ఇసుక దందాలో పాలుపంచుకుంటున్నారు. కొంతమంది రెవెన్యూ అధికారులు తమ అనుచయుల ద్వారా ఇసుక అక్రమ దందాను సాగిస్తున్నారు. రెవెన్యూ అధికారుల సహకారంతోనే అక్రమ దందా యథేచ్ఛగా సాగుతోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.'



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్/ సాక్షి, నాగర్‌కర్నూల్: ఉమ్మడి పాలమూరు జిల్లాలో పలుచోట్ల ఇసుక అక్రమ రవాణా దందా యథేచ్ఛగా కొనసాగుతోంది. అడ్డూ అదుపు లేకుండా అక్రమార్కులు రూ.లక్షల్లో దండుకుంటున్నారు. ఇందుకు పోలీస్, రెవెన్యూ, మైనింగ్ అధికారుల సహకారం అందుతోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు, డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం, సీసీ రోడ్లు, ప్రభుత్వ భవనాల నిర్మాణం పేరుతో అనుమతులు తీసుకుని, ప్రభుత్వ పనుల పేరిట అక్రమ ఇసుక రవాణా చేయడం పరిపాటిగా మారింది. ఇసుక అక్రమ రవాణాకు అండగా నిలిచిన ఐదుగురు ఎస్‌ఐలపై ఇటీవల ఆ శాఖ ఉన్నతాధికారులు చర్యలకు దిగడం చర్చనీయాంశమైంది. అలాగే ఇసుక అక్రమ దందాకు అండగా నిలుస్తున్న రెవెన్యూ అధికారులపై సైతం ప్రభుత్వం దృష్టిపెట్టాలన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

సాక్షి ఫోకస్

ఎక్కడ చూసినా ఇసుక డంపులే ..

ఉమ్మడి జిల్లాలోని తుంగభద్ర నది, దుందుబీ వాగు, ఊకచెట్టు వాగు పరిసర గ్రామాల్లో నిత్యం ఇసుక అక్రమ రవాణా కొనసాగుతోంది. వరద ఉధృతి ఎక్కువగా ఉన్న రోజుల్లో మినహాయించి మిగతా రోజుల్లో అక్రమ ఇసుక రవాణా చేస్తూ అక్రమార్కులు అందినకాడికి దండుకుంటున్నారు. వీరికి రెవెన్యూ, మైనింగ్, పోలీస్ అధికారులు సహకారాన్ని అందిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. సుమారు రెండు నెలల పాటు వర్షాలు, వరద నీటి కారణంగా ఇసుక రవాణా అక్కడక్కడా నిలిచిపోగా, ప్రస్తుతం నీరు తగ్గుముఖం పడుతుండటంతో మళ్లీ యథేచ్ఛగా యంత్రాలతో ఇసుకను తోడేస్తున్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా పరిధిలోని తుంగభద్ర నది పరివాహక ప్రాంతాల్లో అలంపూర్, రాజోళి మండలాలతో పాటు చిన్నధన్వాడ, మానవపాడు, ఉండవెల్లి ప్రాంతాల్లో యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. నారాయణపేట జిల్లా మక్తల్ మండలం పెద్దవాగు సమీప ప్రాంతాలైన దాసరపల్లి, మాగనూరు మండలం వర్కూరు వాగులో అక్రమంగా ఇసుక దందా నడుస్తోంది. మహబూబ్‌నగర్ జిల్లా కోయిల్‌కొండ మండలకేంద్రంలోని వాగు నుంచి ఇసుకను అక్రమంగా తోడుకెళ్తున్నారు. ఇక్కడ ప్రభుత్వ ఇసుక వాహనం ద్వారా అమ్మకాలు సక్రమంగా సాగడం లేదు. నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలం జప్తిసదగోడు–మొల్గర గ్రామాల మధ్యనున్న గాజుగడ్డ ప్రాంతంలో ఎక్కడ చూసినా ఇసుక డంపులే దర్శనమిస్తున్నాయి. దాసర్లపల్లి, ఉల్పర, చింతపల్లి గ్రామాల్లో ఇసుక అక్రమ రవాణా విచ్చలవిడిగా సాగుతోంది. ఇటీవల ఇక్కడి ఇసుక అక్రమ దందా కట్టడిలో నిర్లక్ష్యం వహిస్తూ, అక్రమార్కులకు వంతపాడిన వంగూరు, ఉప్పునుంతల ఎస్‌ఐలపై వేటు వేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

అక్రమ రవాణా కట్టడికి చర్యలు..

ప్రభుత్వం ఆధ్వర్యంలో వాహనాల్లో ఇసుక అందించే ప్రక్రియ జిల్లాలో చేపట్టడం లేదు. ఇసుక సేకరణ, పంపిణీకి అవసరమైన సిబ్బంది లేకపోవడం ఇబ్బందిగా మారింది. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు సాండ్ టాక్సీ విధానం అమలుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. రెవెన్యూ, పోలీస్ అధికారుల సమన్వయంతో అక్రమ ఇసుక రవాణా కట్టడికి చర్యలు తీసుకుంటాం.

– రవీందర్, జిల్లా మైనింగ్ శాఖ అధికారి, నాగర్‌కర్నూల్



నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలం జప్తిసదగోడు సమీపంలో నిల్వ చేసిన ఇసుక డంపులు

ప్రభుత్వ ఆదాయానికి గండి

అక్రమ ఇసుక దందా యథేచ్ఛగా కొనసాగుతుండటం, మరోవైపు ప్రభుత్వం ద్వారా నిర్వహించే సాండ్ టాక్సీ విధానం అమలు కాకపోవడంతో ప్రభుత్వ ఆదాయానికి భారీ స్థాయిలో గండిపడుతోంది. నారాయణపేట జిల్లాలో వేసవి సమయంలో సాండ్ టాక్సీ విధానాన్ని అమలు చేసినా, ప్రభుత్వం కన్నా అక్రమార్కుల ద్వారా తరలించే ఇసుక రవాణానే ఎక్కువగా ఉంటోంది. మిగతా జిల్లాల్లో ఎక్కడా ప్రభుత్వ ఇసుక విధానం సక్రమంగా అమలుకావడం లేదు. ఫలితంగా రూ.కోట్లలో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. ప్రభుత్వ ఇసుక వాహనాల ద్వారా సామాన్యులకు తక్కువ ధరలకే ఇసుక అందుబాటులో ఉండే అవకాశం ఉండగా ఎక్కడా ఈ విధానం అమలుకు నోచుకోవడం లేదు. వానాకాలంలో వాగులన్నీ వరద నీటితో ఇసుక తవ్వకాలకు ఆటంకం ఉండటంతో అంతకుముందే అక్రమార్కులు పెద్ద ఎత్తున ఇసుకను తవ్వి ఎక్కడికక్కడ డంపులను ఏర్పాటు చేశారు. ఈ డంపుల నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తూ అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ప్రభుత్వ ఇసుక రీచుల ఏర్పాటుకు అవకాశం ఉన్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడంతో ప్రభుత్వ ఆదాయాన్ని పెద్ద ఎత్తున గండి పడుతోంది.

న్యూస్‌రీల్

అంగన్‌వాడీల సేవలు వెలకట్టలేం : డీపీఓ



వీపనగండ్ల: గ్రామీణ ప్రాంతాల్లోని అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, ఆయాల సేవలు వెలకట్టలేమని జిల్లా పంచాయతీ అధికారి సురేష్‌కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణ ఉత్సవాలు, బతుకమ్మ సంబరాల కార్యక్రమాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. చిన్నారులకు ప్రాథమిక స్థాయిలో అంగన్‌వాడీ ఉపాధ్యాయులు నేర్పిన అక్షరాలే వారి భవిష్యత్‌కు పునాదులు వేస్తాయని వివరించారు. జిల్లాలోని కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. అనంతరం సామూహిక సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. వివిధ రకాల పువ్వులతో తయారుచేసిన బతుకమ్మలు ఉంచి కోలాటాలు, బొడ్డెమ్మలు వేశారు. కార్యక్రమంలో డీడబ్ల్యూఓ లక్ష్మమ్మ, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎస్‌ఐ రాణి, పలువురు సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ భూములను పరిరక్షించాలి



ఆత్మకూర్: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వక్ఫ్ భూములు అన్యాక్రాంతమవుతున్నాయని.. పట్టణంలోని ఖబ్రస్తాన్‌లో రోడ్డు వేసేందుకు కుట్రలు జరుగుతున్నాయని ఆవాజ్ కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఓ గార్డెన్స్‌లో ఆవాజ్ కమిటీ జిల్లా ఉపాధ్యక్షుడు గయాసొద్దీన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 200 ఏళ్ల కిందటి ఖబ్రస్తాన్‌లో కొందరు రోడ్డు వేసేందుకు సమాధులు ధ్వంసం చేసినా.. నేటి వరకు చర్యలు తీసుకోలేదని అసహనం వ్యక్తం చేశారు. ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని, పక్కా గృహాలు మంజూరు చేయాలని, మైనార్టీ కార్పొరేషన్ రుణాలు అందించాలని, ఖబ్రస్తాన్, వక్ఫ్ భూములను పరిరక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఖాజా, ముజాహిద్, ఫయాజ్, సిరాజ్, భారతీయుడు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రాజు పాల్గొన్నారు.

సామూహిక అక్షరాభ్యాసం



ఎర్రవల్లి: మూలా నక్షత్రాన్ని పురస్కరించుకొని బుధవారం బీచుపల్లి జ్ఞాన సరస్వతి ఆలయంలో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. 200 మంది చిన్నారులకు తల్లిదండ్రుల సమక్షంలో ఆలయ ప్రధాన అర్చకులు వేద మంత్రాలతో అక్షరాభ్యాసం చేయించారు. అంతకుముందు సుప్రభాతసేవ, పంచామృత అభిషేకం, కుంకుమార్చన చేశారు. వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ మేనేజర్ సురేందర్‌రాజు పాల్గొన్నారు.

చదువుల తల్లిని ఆదుకోరూ..!



బోరెల్లి గౌరి

వీపనగండ్ల: మండలంలోని కల్వరాలకు చెందిన బోరెల్లి నర్సింహ, శ్యామల కుమార్తె బోరెల్లి గౌరి మెదక్ జిల్లాలోని మహేశ్వర వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించింది. కాని పేదరికంతో కొట్టుమిట్టాడుతున్న ఆ కుటుంబం కనీసం కళాశాల ఫీజు కూడా చెల్లించలేని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతోంది. దాతలు చేయూతనందించి తమ కుమార్తె ఉన్నత చదువులకు సాయం చేయాలని కోరుతున్నారు. పూర్తి వివరాలకు సెల్‌నంబర్ 76740 33296 సంప్రదించాలన్నారు.

రాష్ట్రంలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమే

- మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ



కొత్తకోట 11వ వార్డులో సభ్యత్వ నమోదు చేయిస్తున్న ఎంపీ డీకే అరుణ

కొత్తకోట రూరల్/మదనాపురం: ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం ఎంతో అభివృద్ధి చెందుతుందని.. తెలంగాణ ప్రజలు బీజేపీ వైపు మొగ్గు చూపుతున్నారని, రానున్న రోజుల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. బుధవారం ఆమె మదనాపురం, కొత్తకోటలోని 11వ వార్డులో నిర్వహించిన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని సభ్యత్వాలు చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో సీఎం రేవంత్‌రెడ్డి పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని.. కేంద్రం చేస్తున్న అభివృద్ధిని ప్రజలకు వివరించాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే వారు సభ్యత్వ నమోదులో చురుగ్గా పాల్గొనాలన్నారు. 100కుపైగా సభ్యత్వాలు చేసిన వారికే మొదటి ప్రాధాన్యం ఉంటుందని.. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు నిరంతరం కృషి చేయాలని సూచించారు. కొత్తకోటలో జరిగిన కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు సుదర్శన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు నారాయణ, మాజీ అధ్యక్షుడు రాజవర్ధన్‌రెడ్డి, నియోజవర్గ ఇన్‌చార్జ్ కొండ ప్రశాంత్‌రెడ్డి, కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు దాబా శ్రీనివాస్‌రెడ్డి, భరత్‌భూషణ్, నరేందర్‌గౌడ్, కోటేశ్వర్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, రాజారాం, బుచ్చిరెడ్డి, గండు రవీందర్‌గౌడ్, మదనాపురంలో జరిగిన కార్యక్రమంలో మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ శాసనసభ్యుడు రావుల రవీంద్రనాథ్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, ప్రధానకార్యదర్శి వెంకటయ్య, మాధవరెడ్డి, సభ్యత్వ సహ ఇన్‌చార్జ్ నారాయణరెడ్డి, రాజశేఖర్, బీజేవైఎం జిల్లా ప్రధానకార్యదర్శి బిట్ల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం

- ఆత్మకూర్‌కు పూర్వ వైభవం తీసుకొస్తాం
- మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

ఆత్మకూర్: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముందుకెళ్తున్నారని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. బుధవారం మండలంలోని బాలకిష్టాపూర్, ఎంపీడీఓ కార్యాలయంలో కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులు, రాయితీ గ్యాస్ సిలిండర్ల ప్రొసీడింగ్‌లను లబ్ధిదారులకు అందజేసి మాట్లాడారు. నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు శరవేగంగా కొనసాగుతున్నాయని.. మండలంలో ఇప్పటి వరకు 4,175 మంది రైతులకు రూ.30.50 కోట్ల పంట రుణమాఫీ జరిగిందని వివరించారు. మిగిలిన అర్హులను గుర్తించి వారికి కూడా లబ్ధి చేకూర్చేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. 3,447 మందికి రాయితీ గ్యాస్ సిలిండర్ల ప్రొసీడింగ్‌లు అందజేశామని.. దరఖాస్తు చేసుకోని వారికి కూడా పథకం వర్తింపజేస్తామన్నారు. ఆత్మకూర్‌కు పూర్వ వైభవం తీసుకొస్తామని, మున్సిపాలిటీతో పాటు గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. వంద పడకల ఆస్పత్రి నిర్మాణానికి ప్రతిపాదనలు చేశామని.. త్వరలోనే అనుమతి రానుందని వివరించారు. పట్టణ శివారులోని పీజేపీ క్వార్టర్స్‌లో భవన నిర్మాణానికి స్థల పరిశీలన పూర్తిచేసి నివేదిక అందజేయాలని తహసీల్దార్‌కు సూచించారు. కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి, రాష్ట్ర గీత కార్మికసంఘం చైర్మన్ కేశం నాగరాజుగౌడ్, పుర చైర్‌పర్సన్ గాయత్రి, తహసీల్దార్ చాంద్‌పాషా, పుర కమిషనర్ నాగరాజు, ఎంపీడీఓ సుజాత, కాంగ్రెస్ నాయకులు గంగాధర్‌గౌడ్, రహ్మతుల్లా, పరమేష్, తులసీరాజ్, నల్గొండ శ్రీను, రామలక్ష్మారెడ్డి, హుస్సేన్‌మియా, మశ్చందర్‌గౌడ్, ఖాజన్న, అనిత, చిరంజీవి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులకు పరిహారం

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా నష్టపరిహారం చెల్లింపు వివరాలు

జిల్లా	ఎకరాలు	రైతులు	మొత్తం సొమ్ము
నాగర్‌కర్నూల్	2,290.31	2,380	రూ.2,29,07,750
వనపర్తి	1,986.31	2,386	రూ.1,98,67,750
జోగుళాంబ గద్వాల	1,800.19	1,389	రూ.1,80,04,750
నారాయణపేట	1,239.33	1,060	రూ.1,23,98,250
మహబూబ్‌నగర్	766	912	రూ.76,60,000

సాక్షి, నాగర్‌కర్నూల్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంటలను నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారాన్ని ప్రకటించింది. ఎకరాకు రూ.10 వేల చొప్పున రైతులకు పరిహారాన్ని చెల్లించనుంది. ఉమ్మడి పాలమూరు జిల్లాలో అత్యధికంగా నాగర్‌కర్నూల్ జిల్లాలో 2,290.31 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లగా మొత్తం 2,380 మందికి రూ.10వేల చొప్పున పరిహారం అందనుంది. వనపర్తి జిల్లాలో అత్యధికంగా మొత్తం 2,386 మందికి అధికారులు పరిహారాన్ని చెల్లించనున్నారు. అత్యల్పంగా మహబూబ్‌నగర్ జిల్లాలో మొత్తం 766 ఎకరాల్లో పంట నష్టానికి 912 మందికి మొత్తం రూ.76.60 లక్షల నష్టపరిహారాన్ని అందించనున్నారు. జిల్లాల్లో వ్యవసాయ శాఖ అధికారుల ద్వారా క్షేత్రస్థాయిలో పరిశీలించి పంట నష్టపోయిన రైతులను గుర్తించి అర్హుల జాబితాను సిద్ధం చేశారు. నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లోనే ఎకరాకు రూ.పది వేల చొప్పున నష్టపరిహారాన్ని చెల్లించనున్నారు.

మాత, శిశు మరణాలు తగ్గించాలి



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి.. హాజరైన అధికారులు

- కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి: జిల్లాలో మాత, శిశు మరణాలు తగ్గించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో నిర్వహించిన సమీక్షలో జనవరి నుంచి గత నెల వరకు జిల్లాలో చోటు చేసుకున్న మాత, శిశు మరణాలు, అందుకు గల కారణాలపై చర్చించారు. ఇప్పటి వరకు 56 శిశు మరణాలు చోటు చేసుకున్నట్లు జిల్లా వైద్యాధికారి కమిటీ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైరిస్క్ గర్భిణుల ఆరోగ్యంపై వైద్యాధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, తప్పనిసరిగా పూర్వ ఆరోగ్య పరిస్థితులపై వివరాలు అడిగి తెలుసుకొని అవే విషయాలు ఏఎన్‌సీ చెకప్‌లో నమోదు చేయాలని సూచించారు. ఒక్కో ఘటనపై లిఖితపూర్వకంగా నివేదిక అందజేయాలని ప్రోగ్రాం అధికారులను ఆదేశించారు. వీపనగండ్ల తదితర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సిజేరియన్లు ఎక్కువగా ఎందుకు జరుగుతున్నాయని ప్రశ్నించారు. ప్రతి పీహెచ్‌సీలో స్టాఫ్ నర్స్, లేబర్ వార్డులో ఏసీతో పాటు మౌలిక వసతులు కల్పించినందున ప్రసవాల సంఖ్య గణనీయంగా పెరగాలని ఆదేశించారు. అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించి మొదటి ఏఎన్‌సీలు తప్పనిసరిగా నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, జిల్లా వైద్యాధికారి డా. జయచంద్రమోహన్, స్త్రీ వైద్య నిపుణురాలు డా. కిరణ్మయి, డా. సాయినాథ్‌రెడ్డి, ప్రోగ్రాం, మెడికల్ అధికారులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ..

తెలంగాణ సామాజిక ఆర్థిక ముఖచిత్రం 2024 పుస్తకాన్ని బుధవారం కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఓ భూపాల్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ యాదయ్య, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రక్త నిల్వలు ఉండాలి..

జిల్లాలో రక్తదాన శిబిరాలు, అవగాహన సదస్సులు నిర్వహించి రక్త నిల్వలకు కొదవ లేకుండా చూసుకోవాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన రెడ్‌క్రాస్ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో రక్తం అత్యవసరం అయితే eraktkosh.mohfw.gov.in వెబ్‌సైట్‌లో శోధించాలన్నారు. సమావేశంలో డా. చైతన్య, రెడ్‌క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ సయ్యద్ కలాంపాషా, జిల్లా కో–ఆర్డినేటర్ ఆర్.రాజేందర్‌కుమార్, కార్యదర్శి కృష్ణసాగర్ తదితరులు పాల్గొన్నారు.



జెండా ఊపి బస్సులను ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

హైదరాబాద్‌కు తరలిన డీఎస్సీ అభ్యర్థులు

వనపర్తి: డీఎస్సీలో ఉపాధ్యాయ కొలువులు సాధించిన 123 మంది అభ్యర్థులు సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకునేందుకు బుధవారం జిల్లాకేంద్రం నుంచి ప్రత్యేక బస్సుల్లో హైదరాబాద్‌కు బయల్దేరి వెళ్లారు. స్థానిక పాలిటెక్నిక్ కళాశాల క్రీడా మైదానంలో ప్రత్యేక బస్సులను అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో డీఈఓ గోవిందరాజులు, ఏఓ భానుప్రకాష్, తహసీల్దార్ రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

బతుకమ్మలతో కలెక్టర్ ఆదర్శ్ సురభి, అధికారులు



కలెక్టరేట్‌లో బతుకమ్మ సంబరాలు



బతుకమ్మ ఆడుతున్న మహిళలు

కలెక్టరేట్‌లో బుధవారం బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. మహిళా స్వయం సహాయక సంఘాలు, మెప్మా, స్త్రీ, శిశు సంక్షేమశాఖ సిబ్బంది తీరొక్క పువ్వులతో తయారుచేసి తీసుకొచ్చిన బతుకమ్మలకు కలెక్టర్ ఆదర్శ్ సురభి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మన సంస్కృతి, సంప్రదాయాల్లో బతుకమ్మ పండుగ భాగమైందని కలెక్టర్ అన్నారు. ఈ పండుగ రాష్ట్రంతో పాటు ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యం పొందిందని.. మానవాళిని ప్రకృతికి దగ్గర చేసే పండుగను ఏటా ఘనంగా నిర్వహించుకోవాలని కోరారు. చక్కటి బతుకమ్మలను తయారు చేసిన వారికి బహుమతి అందజేశారు.

– వనపర్తి

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో బీటెక్ విద్యార్థి మృతి

జడ్చర్ల: ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై బీటెక్ విద్యార్థి మృతిచెందిన ఘటన బుధవారం పట్టణంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని కోడ్గల్‌కు చెందిన వెంగళ్‌రెడ్డి పట్టణంలోని కల్వకుర్తి రోడ్ సమీపంలో వాహనాల వాషింగ్ సెంటర్ నిర్వహిస్తున్నారు. అతడి కుమారుడు పవన్‌కుమార్ రెడ్డి (18) బీటెక్ చదువుతుండగా.. దసరా సెలవులు ఉండటంతో కేంద్రానికి వచ్చి తండ్రికి చేదోడుగా ఉండేవాడు. ఈ క్రమంలో బుధవారం కారును శుభ్రం చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురయ్యాడు. అక్కడ ఉన్నవారు వెంటనే గుర్తించి చికిత్స నిమిత్తం జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. కుమారుడి మృతితో తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ..

వనపర్తి రూరల్: అనుమానాస్పద స్థితిలో మహిళ మృతిచెందిన ఘటన వనపర్తి మండలం చిమనగుంటపల్లి శివారులో బుధవారం వెలుగుచూసింది. రూరల్ ఎస్ఐ జలేందర్‌రెడ్డి వివరాల మేరకు.. గోపాల్‌పేట మండలం ధర్మాతండాకు చెందిన చెందిన పాత్లావత్ శాంతమ్మ (40) వ్యవసాయ కూలీ పనులు చేస్తూ జీవనం సాగించేది. ఆమెకు ముగ్గురు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. మంగళవారం ఇంటి నుంచి వెళ్లిన శాంతమ్మ.. ఏనుకుంట నుంచి బుద్ధారం వెళ్లే రహదారి సమీపంలోని ఓ వ్యవసాయ బావిలో శవమై తేలింది. ఆమె మృతదేహాన్ని స్థానికులు గుర్తించి, పోలీసులకు సమాచారం అందించడంతో అగ్నిమాపక సిబ్బంది సహకారంతో బయటికి తీశారు. ఘటనా స్థలానికి ఎస్పీ రావుల గిరిధర్, డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు, సీఐ నాగభూషన్‌రావులు చేరుకొని వివరాలు సేకరించారు. డాగ్ స్క్వాడ్‌తో విచారణ చేపట్టారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని వనపర్తి మార్చురీకి తరలించారు. ఘటనా స్థలంలో మద్యం సీసాలు ఉన్నాయని.. ఆమె మృతిపై అనుమానాలు ఉన్నాయని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతురాలి కుమారుడు గణేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

కల్వకుర్తి టౌన్: కల్వకుర్తి పట్టణంలోని నాగర్‌కర్నూల్ రోడ్డులో బుధవారం తెల్లవారుజామున బొలెరోలో 21క్వింటాల రేషన్ బియ్యం పట్టుకున్నట్లు ఎస్ఐ మాధవరెడ్డి తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం.. సివిల్ సప్లయ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రాఘవేందర్‌రెడ్డి, కల్వకుర్తి పోలీసుల ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. వెల్దండ మండలం నుంచి నాగర్‌కర్నూల్ వైపు బొలెరాలో 21 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నారు. వాహనాన్ని, రేషన్ బియ్యాన్ని సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి రాఘవేందర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆటో బోల్తా : ఇద్దరికి గాయాలు

వనపర్తి రూరల్: పెబ్బేరు మండలం రంగాపురం సమీపంలో బుధవారం ఆటో అదుపు తప్పి బోల్తాపడిన ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డి వివరాల మేరకు.. జోగుళాంబ గద్వాల జిల్లా చెనుగొనిపల్లికి చెందిన 15 మంది ఆటోలో వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలం ఉప్పరిపల్లికి వెళ్లి వస్తుండగా.. రంగాపురం సమీపంలో జాతీయ రహదారిపై ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం హైవే అంబులెన్స్‌లో గద్వాల ఆస్పత్రికి తరలించారు. మిగతా వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గొర్రెల మందపైకి దూసుకెళ్లిన కారు

అచ్చంపేట రూరల్: కారు అతివేగంగా దూసుకెళ్లి గొర్రెల మందపై పడడంతో 15 గొర్రెలు మృత్యువాత పడిన సంఘటన బుధవారం సాయంత్రం మండలంలోని బ్రాహ్మణపల్లి సమీపంలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. షాద్‌నగర్‌కు చెందిన ఐదుగురు కారులో శ్రీశైలం బయలు దేరారు. బ్రాహ్మణపల్లికి చెందిన శ్రీశైలంయాదవ్ తన గొర్రెల మందను సమీప పొలాల్లో మేపుకుని ఇంటింటికి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో కారు అతివేగంగా గొర్రెల మందపైకి దూసుకొచ్చింది. దీంతో మందలోని 15గొర్రెలు అక్కడికక్కడే మృత్యువాత పడ్డాయి. మరి కొన్ని గొర్రెలకు కాళ్లు విరిగాయి. కారులో వ్యక్తులను సమీప రైతులు పట్టుకున్నారు. సుమారు రూ.2లక్షలకు పైగా నష్టం జరిగిందని రైతు శ్రీశైలంయాదవ్ తెలిపారు. ఈ విషయమై సిద్దాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపాడు.



కల్యాణ వైభోగమే..



జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వరస్వామి కల్యాణ వేడుక జరిపిస్తున్న పండితులు

- కనులపండువగా జోగుళాంబ - బాలబ్రహ్మేశ్వరస్వామి శాంతి కల్యాణోత్సవం
- పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం రేవంత్‌రెడ్డి కుటుంబ సభ్యులు

జోగుళాంబ శక్తిపీఠం: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని అలంపూర్ క్షేత్రంలో బుధవారం జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వరస్వామి శాంతి కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. స్వామివారి ఆలయం నుంచి ఉత్సవ మూర్తులను పల్లకీలో ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి తీసుకువచ్చారు. వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి.. ఆగమ సంప్రదాయ ప్రకారం కల్యాణ వేడుక జరిపారు. సుముహూర్తంలో మాంగళ్యధారణ చేశారు. కల్యాణోత్సవంలో కీలక ఘట్టమైన మహాసంకల్పం, కళ్ల కడగడం, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు, బ్రహ్మముడి వంటి కార్యక్రమాలను భక్తులు కనులారా తిలకించి తన్మయం చెందారు. వాటి ప్రాముఖ్యతను ఆలయ ముఖ్య అర్చకుడు వనం శ్రీకాంత్ శర్మ భక్తులకు వివరించారు. దేవతా మూర్తులకు వేసిన ముత్యాల తలంబ్రాలను భక్తులకు ప్రసాదంగా అందజేశారు. అనంతరం దేవతా మూర్తులకు దశవిధ హారతులు అందజేసి, భక్తులకు తీర్థప్రసాదం వితరణ చేశారు. కల్యాణ వేడుకలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డి దంపతులు పాల్గొని స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం చండీ హోమాలు నిర్వహించారు.

కాళరాత్రిగా జోగుళాంబదేవి..

జోగుళాంబ అమ్మవారిని కాళరాత్రీదేవిగా అలంకరించి ఆరాధించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూలనక్షత్రం కావడంతో భక్తులు సరస్వతీ పూజలు చేశారు. చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. ఓం నమో జోగుళాంబయే నమః అంటూ అమ్మవారి దీక్ష చేపట్టిన భక్తులు ఆధ్యాత్మిక అనుభూతిని పొందారు. స్వామివారి ఆలయంలో ఏకవార రుద్రాభిషేకాలు నిర్వహించారు.



అమ్మవారికి అభిషేకాలు నిర్వహిస్తున్న తిరుపతిరెడ్డి దంపతులు

దర్శించుకున్న ప్రముఖులు..

జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయాలను పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే విజయుడుతో పాటు ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్, డీఐజీ చౌహాన్, ఎస్పీ శ్రీనివాసరావు, జిల్లా ప్రిన్సిపల్ జడ్జి కుష, సీనియర్ సివిల్‌జడ్జి గంట కవిత, కమలాపురం కవిత, ఏపీ హైకోర్టు జడ్జి హరినాథ్, మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిర బోయి, మాజీ ఎమ్మెల్యే రావుల రవీంద్రనాథ్‌రెడ్డి, , రాయచూరు ఎమ్మెల్యే దద్దన్‌గౌడు తదితరులు దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ నాగేశ్వర్ రెడ్డి, ఈఓ పురేందర్‌కుమార్ వారి కి అమ్మవారి, స్వామివారి జ్ఞాపికతో పాటు శేష వస్త్రాలను అందజేసి సత్కరించారు.



స్వామి, అమ్మవార్లకు పల్లకీసేవ నిర్వహిస్తున్న భక్తులు

ఆకట్టుకున్న సువాసిని, కుమారి పూజలు..

అమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న సువాసిని, కుమారి పూజలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. సాక్షాత్తు జగన్మాత అయిన జోగుళాంబ పాద పద్మాల చెంతన ముత్తయిదులు, కుమారిలతో పూజలు చేయించి, అమ్మవారి శేషవస్త్రాలను అందజేస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈఓ పురేందర్‌కుమార్, పాలక మండలి సభ్యులు చంద్రశేఖర్‌రెడ్డి, పులేందర్ చర్యలు చేపట్టారు. బాలబ్రహ్మేశ్వర నిత్యాన్నదాన సత్రంలో రోజు 500 మంది భక్తులకు భోజనాలు ఏర్పాటు చేస్తున్నట్లు సత్రం ఇన్‌చార్జి ప్రదీప్ తెలిపారు.



ఆలయంలో భక్తుల రద్దీ

మైసమ్మ అడవిలో వేదఘోష



సరస్వతీదేవి అలంకరణలో మైసమ్మ



చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు

నవాబుపేట: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని పర్వతాపూర్ మైసమ్మ ఆలయంలో బుధవారం చండీ హోమం నిర్వహించారు. వేద మంత్రోచ్చారణలతో మైసమ్మ అటవీ ప్రాంతం మార్మోగింది. అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఈఓ మధనేశ్వర్‌రెడ్డి, ఆలయ మాజీ చైర్మన్ జగన్మోహన్‌రెడ్డి, శ్రీకాంత్ శర్మ, గోపాల్, మల్లేష్, నర్సింహులు, చంద్రకళ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణే లక్ష్యం



జిల్లా కేంద్రంలో పథసంచలన్ నిర్వహిస్తున్న సమితి కార్యకర్తలు

స్టేషన్ మహబూబ్‌నగర్: భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణే లక్ష్యంగా పనిచేస్తున్న అతి పెద్ద హిందూ మహిళా సంస్థ రాష్ట్ర సేవికా సమితి అని సక్షమ్ ప్రాంత మహిళా ప్రముఖ్ వక్కలంక మహతి అన్నారు. రాష్ట్ర సేవికా సమితి పాలమూరు ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మోడల్ బేసిక్ ఉన్నత పాఠశాల ఆవరణలో విజయ దశమి ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్కలంక మహతి మాట్లాడుతూ.. సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాల్లో రాష్ట్ర సేవికా సమితి చురుగ్గా పాల్గొంటుందన్నారు. దేశంలోని అన్ని ప్రాంతాల్లో వివిధ స్థాయిల్లో విద్య, అవగాహన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశం అంతటా 475 సేవా ప్రాజెక్టులను నిర్వహిస్తుందని.. వీటిలో గోశాలలు, గ్రంథాలయాలు, కంప్యూటర్ శిక్షణ కేంద్రాలు, అనాథాశ్రమాలు కూడా ఉన్నాయన్నారు. అంతకుముందు రాష్ట్ర సేవికా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన పథసంచలన్ ఆకట్టుకుంది. పట్టణ పురవీధుల గుండా వందలాది మంది సమితి కార్యకర్తలు కార్యక్రమ వేదిక వరకు పథసంచలన్ నిర్వహించారు. కార్యక్రమంలో డా.పద్మావతి, రాష్ట్ర సేవికా సమితి సహసంయోజికురాలు ఉమాదేవి, పాలమూరు జిల్లా కార్యవాహిక నాగిళ్ల అరుణ, విభాగ్ కార్యవాహిక దేదిప్యశ్రీ పాల్గొన్నారు.

జూరాలకు 22 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

ధరూరు/ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో మరింత తగ్గింది. మంగళవారం రాత్రి 33వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. బుధవారం రాత్రి 8 గంటల వరకు 22వేల క్యూసెక్కులకు ఇన్‌ఫ్లో తగ్గినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. 11 యూనిట్లలో విద్యుత్ ఉత్పత్తి చేపట్టినట్లు ఎస్ఈ సూరిబాబు తెలిపారు. ఎగువలో 5 యూనిట్ల ద్వారా 196 మెగావాట్లు, 250.024 ఎంయూ.. దిగువలో 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్లు, 227.385 ఎంయూ ఉత్పత్తిని చేపట్టామన్నారు. ఇప్పటివరకు 477.409 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తిని సాధించామని తెలిపారు. జూరాల ప్రాజెక్టు నుంచి విద్యుత్ ఉత్పత్తి నిమిత్తం 20,611 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు. నెట్టెంపాడు ఎత్తిపోతలకు 750 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 94, ఎడమ కాల్వకు 1,130, కుడి కాల్వకు 731 క్యూసెక్కులతో కలిపి మొత్తం 23,216 క్యూసెక్కుల నీటిని దిగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టు వైపు విడుదల చేస్తున్నారు.



జూరాల ప్రాజెక్టు నుంచి జెన్‌కో పవర్‌హౌజ్‌లోకి చేరుతున్న వరద

సుంకేసులలో మూడు గేట్లు ఎత్తివేత..

రాజోళి: సుంకేసుల డ్యాం వద్ద మూడు గేట్లను తెరిచి నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు జేఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 15,885 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 13,437 క్యూసెక్కులను దిగువకు వదులుతున్నట్లు పేర్కొన్నారు. కేసీ కెనాల్‌కు 2,445 క్యూసెక్కులను విడుదల చేసినట్లు పేర్కొన్నారు.

శ్రీశైలంలో 882.1 అడుగుల నీటిమట్టం..

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో 882.1 అడుగుల వద్ద 212.3870 టీఎంసీల నీటి నిల్వ ఉంది. జూరాల, సుంకేసుల నుంచి 34,048 క్యూసెక్కులు శ్రీశైలం జలాశయానికి చేరుతున్నాయి. భూగర్భ జలవిద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తికి 35,315, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో ఉత్పత్తికి 30,627 క్యూసెక్కులతో కలిపి మొత్తం 65,942 క్యూసెక్కుల నీటిని దిగువన సాగర్‌కు విడుదల చేస్తున్నారు. 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడుకు 10,000, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్ఎన్ఎస్ఎస్‌కు 1,540, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్ఐకు 800 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భూగర్భ కేంద్రంలో 16.270 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేశారు.

'అక్రమ అరెస్టులు సరికాదు'



కొత్తకోట పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పట్నం నరేందర్‌రెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు

కొత్తకోట: రాష్ట్ర ప్రభుత్వం కొడంగల్ నియోజకవర్గంలో ఫార్మా కంపెనీలు ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకోవడంపై అక్కడి రైతులు పాదయాత్ర, ధర్నా చేస్తుండగా.. వారికి మద్దతు తెలిపేందుకు వెళ్తున్న కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డిని పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేశారని.. ఇది సరైంది కాదని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. అక్రమంగా అరెస్ట్ చేసిన ఇరువురిని కొత్తకోట పోలీస్‌స్టేషన్‌కు తరలించారని తెలుసుకున్న మాజీ మంత్రి, మాజీ రాజ్యసభ సభ్యుడు రావుల చంద్రశేఖర్‌రెడ్డి, దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అక్కడికి చేరుకొని వారికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు రైతులకు అండగా ఉంటారని, ఉద్యమాలు పార్టీకి, నాయకులకు కొత్త కాదన్నారు. అక్రమ అరెస్టులతో ప్రజలు, ప్రతిపక్షాల గొంతు నొక్కలేరని.. ఎన్ని నిర్బంధాలు చేసినా ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ వామన్‌గౌడ్, మాజీ ఎంపీపీ గుంత మౌనిక, జెడ్పీటీసీ మాజీ సభ్యులు పి.విశ్వేశ్వర్, చెన్నకేశవరెడ్డి, గాడీల ప్రశాంత్, కౌన్సిలర్ రాములుయాదవ్, అద్వానీ శ్రీను, కటికె శ్రీను, నందిమళ్ల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల పనులు ప్రారంభం



కురుమూర్తిస్వామి ఆలయం వద్ద రంగులు అద్దుతున్న కూలీలు

చిన్నచింతకుంట: మండలంలోని అమ్మాపూర్ గ్రామ సమీపంలో వెలసిన కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలకు సంబంధించిన పనులను బుధవారం ఆలయ అధికారులు ప్రారంభించారు. స్వామివారి ప్రధాన ఆలయం, మెట్లు, మెట్ల చిడిలు తదితర వాటికి రంగులు అద్దుతున్నారు. కొండ దిగువన పిచ్చి మొక్కలు తొల గించే పనులు చేపట్టారు.

కేసు నమోదు

నాగర్‌కర్నూల్ (బిజినేపల్లి): వివాహితపై అత్యాచార యత్నానికి పాల్పడటమే కాకుండా ఆమె మెడలోని పుస్తెల తాడును లాకున్న తిరుపతి అలియాస్ తిరుపాల్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగశేఖరరెడ్డి తెలిపారు. వట్టెం శివారులోని కేఎల్ఐ కాల్వ సమీపంలో ఉన్న నిర్మానుష్య ప్రదేశంలో తిరుపాల్ ఓ మహిళపై అత్యాచార యత్నం చేయగా ఆమె తప్పించుకుంది. ఈ సమయంలో ఆమె మెడలోని రెండు తులాల పుస్తెల తాడును లాక్కున్నాడు. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు బుధవారం సాయంత్రం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

పొలాల్లోకి కాలుష్య జలాలు



ఓ పరిశ్రమ నుంచి బయటికి వదులుతున్న కాలుష్య జలాలు



రైతుల పొలాల్లోకి వెళ్లే డ్రెయినేజీలోకి వదులుతున్న కాలుష్యపు నీరు

రాజాపూర్: చిన్నపాటి వర్షం కురిసినా ఆ పరిశ్రమలకు కాలుష్య జలాలు వదిలేందుకు అదునుగా మారింది. బుధవారం చిన్నపాటి వర్షం కురవడంతో పరిశ్రమల నుంచి నురుగుకక్కుతూ పెద్ద ఎత్తున కాలుష్య నీటిని పోలేపల్లి సెజ్‌లోని పరిశ్రమలు వదులుతున్నాయి. రాయపల్లి, ముదిరెడ్డిపల్లి గ్రామాల రైతుల వ్యవసాయ పొలాల్లోకి కాలుష్య జలాలు వదిలారు. దీన్ని గమనించిన కొందరు రైతులు సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యను కొన్ని సంవత్సరాలుగా సంబంధిత అధికారులు దృష్టి పెట్టకపోవడంతో పరిశ్రమలను కాలుష్య జలాలు వదులుతున్నారు.

పట్టపగలే ఇంట్లో చోరీ

మరికల్: ఎవరూ లేని ఇంట్లో దొంగలు చొరబడి చోరీకి పాల్పడిన సంఘటన మండల కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మరికల్‌కు చెందిన కుర్వ మొగులప్ప పని నిమిత్తం దేవరకద్రకు వెళ్లాడు. కుమారుడు రోడ్డుపై కిరాణం దుకాణం దగ్గర ఉన్నాడు. మధ్యాహ్న సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో గుర్తు తెలియని దుండగులు ఇంటి తాళం పగులగొట్టి, బీరువాలో ఉన్న 5 తులాల బంగారం, రూ.5లక్షలు తీసుకెళ్లారు. సాయంత్రం కుటుంబ సభ్యులు ఇంటికి రాగా తులపులు తెరుచుకొని కనిపించాయి. బీరువా తెరుచుకొని ఉండడంతో దొంగలు పడినట్లు గుర్తించిపోలీసులకు ఫిర్యాదు చేశాడు. వెంటనే రంగంలో దిగిన సీఐ రాజేందర్ రెడ్డి, ఎస్ఐ మురళి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీం ఇంట్లో వేలిముద్రలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పొటాష్.. పంటలకు లాభం

పాడి పంట

అధికారి సలహా: వ్యవసాయశాఖ అధికారి సక్రియ నాయక్

అలంపూర్: పొటాష్ అన్ని పంటకు మేలు చేస్తోంది. వీటిని సక్రమంగా వినియోగించుకుంటే పంటలకు చీడ పీడలు తగ్గుతాయి. నత్రజని, భాస్వరంతో పాటు పొటాష్ వినియోగం వల్ల నాణ్యమైన పంట చేతికి అందుతుందని జిల్లా ఇన్‌చార్జి వ్యవసాయశాఖ అధికారి సక్రియా నాయక్ రైతులకు సూచించారు. మొక్కను గ్రహించిన నత్రజని, భాస్వరంను పొటాష్ వలన పంటలకు కలిగే ప్రయోజనాలను ఈ విధంగా వివరిస్తున్నారు.

ప్రయోజనాలు..

నత్రజని అధికం కావడం వల్ల పంటకు జరిగే నష్టాన్ని నిరోధిస్తుంది. పొటాష్‌తో మొక్కలకు పొడుగైనా, బలమైన, ఆరోగ్యవంతమైన గుబురు వేర్లు పుడతాయి. భూమిలోకి లోతుగా చొచ్చుకపోయి వేళ్ల తేమను, పోషకాలను బాగా గ్రహిస్తాయి. గాలులకు వాలిపోవు. వరి కంకుల్లో గింజలు నిండుగా ఏర్పడటానికి తోడ్పడుతుంది. వరి మొక్క బాగా పీచు తేలి ధ్రుఢంగా ఉంటుంది. పోషక పదార్థాలను మొక్కలోని అన్ని భాగాలకు చేరవేయడంలో సహాయపడుతుంది. మొక్కల అభివృద్ధికి కావాల్సిన కాల్షియం, మెగ్నీషియం, గంధకం, ఇనుము, తుత్తునాగం వంటి ఉప సూక్ష్మ పదార్థాలు గ్రహించేందుకు సహాయ పడుతుంది. మొక్కలు వేడి, చలి, నీటి ఎద్దడిని తట్టుకొని పరిపుష్టిగా ఉంటాయి.

పొటాష్ లోప లక్షణాలు..

మొక్క ప్రారంభ దశలో పొటాష్ లోప లక్షణాలు కనిపించవు. అభివృద్ధి చెందని నల్లని వేర్లు పొటాష్ లోపానికి గుర్తు. ఆకులు ముదురు ఆకుపచ్చగా ఉండి వాటి మీద తుప్పు రంగు మచ్చలు ఏర్పడతాయి. క్రమంగా ఇవి మొక్క అంత వ్యాప్తి చెందుతాయి. ముదిరిన ఆకులు ఎండి రాలిపోతాయి. మొక్కలు సరిగ్గా ఎదగవు. బలహీనంగా పొట్టిగా ఉంటాయి. పొటాష్ లోపం వలన చాల రకాల వేర్లు ఒరిగిపోతాయి. చిన్న కంకులు ఏర్పడి పొల్లు గింజలు అధికమవుతాయి. అగ్గి తెగులు, ఆకు మచ్చ తెగులు, సుడి తెగులు, సుడి తెగులు ఉధృతంగా పంటపై ప్రభావం చూపుతాయి.



వరిపైరులో పొటాష్ లోపం

నివారణ చర్యలు..

భూసార పరీక్షల ఆధారంగా పొటాష్ ఎరువును వినియోగించాలి. సాధరణంగా వరికి ఎకరాకు 18 కిలో పొటాష్ వేస్తే సరిపోతుంది. సిఫార్సు చేసిన మోతాదును రెండు సమ భాగాలుగా చేసి చివరి దమ్ములోను, సిరుపొట్ట దశలోను వేయాలి. పొటాష్‌ను నీటిలో కలిపి పిచికారి చేయడం వలన అధిక ప్రయోజనం ఉంటుంది. జింకు లోపం ఉన్న భూముల్లో పొటాష్ మొత్తం యూరియాతో పాటు దమ్ములోనే వేయాలి. వేరు శనగ, మొక్కజొన్న తదితర పంటల్లో పొటాష్ బాగ పని చేస్తోంది.



చిన్ననాటి రతన్ టాటా (ఎడమవైపు)


జేఆర్‌డీ టాటాతో రతన్


ప్రధాని మోదీతో రతన్ టాటా


2008లో నాటి రాష్ట్రపతి ప్రతిభాపాటిల్ చేతులమీదుగా పద్మవిభూషణ్ అందుకుంటున్న రతన్ టాటా


ఎఫ్18, ఎఫ్16 యుద్ధవిమానాల్లో ప్రయాణిస్తున్న రతన్



జీవితంలో ఎత్తు, పల్లాలు ఉండాల్సిందే. కొన్ని సార్లు స్ట్రెయిట్ లైన్ కూడా బాగుండదు. ఈసీజీ రిపోర్ట్‌లో సరళ రేఖ వచ్చిందంటే మనం బతికిలేమని అర్థం

వాస్తవిక ప్రపంచంలో వస్తువులు ఎందుకూ పనికిరావని ఏదో ఒకనాడు మనం అర్థం చేసుకుంటాం. అన్నింటికంటే ప్రేమే ముఖ్యమని గ్రహిస్తాం

ఉత్తమమైన లీడర్ ఎవరంటే.. వాళ్లకంటే అత్యంత తెలివిగా వ్యవహరించే అనుచరులు, సహాయకులను చుట్టూతా పెట్టుకున్న వాళ్లే.

వృత్తిజీవితానికి, వ్యక్తిగత జీవితానికి మధ్య సమతుల్యత సాధించడం మీద నాకు పెద్దగా నమ్మకం లేదు. వృత్తిని, జీవితాన్ని సమ్మిళితం చేసుకోవడమే నాకిష్టం. పని, జీవితాన్ని అత్యంత అర్థవంతంగా మార్చుకోండి

జీవితంలో పెద్ద రిస్క్ ఏంటంటే రిస్క్‌ను తీసుకోకపోవడమే. క్షణక్షణం మారే ప్రపంచంలో రిస్కులు తీసుకోలేదంటే మనం ఫెయిల్ అయిపోతాం

నిరంతరం హుషారుగా ఉండండి. అప్పుడే విజయం మీ వశమవుతుంది

రతనాల మాట..

ఇతరులతో సంభాషించేటప్పుడు దయ, సహానుభూతి, కరుణతో మెలగండి. వాటిని తక్కువ అంచనా వేయొద్దు

నాయకత్వం అనేది బాధ్యత తీసుకోవడం మాత్రమే. సాకులు చెప్పడం కాదు

అవకాశాలు మీ చెంతకు వస్తాయని వేచి చూడొద్దు. మీరే వాటిని సృష్టించుకోండి

ఎల్లప్పుడూ సుఖప్రదమైన జీవితం మీకు ఉండకపోవచ్చు. అలాగే ప్రపంచ సమస్యలు అన్నింటినీ మీరు పరిష్కరించలేకపోవచ్చు. కానీ మీ ప్రాధాన్యాన్ని మీరు తక్కువగా అంచనావేయొద్దు. ధైర్యం అనేది ఒక అంటువ్యాధిలా వ్యాపించేది. ఆశ జీవితాన్ని నిలబెడుతుంది.

- రతన్ టాటా


నానో కారు ఆవిష్కరణలో...

అనితర సాధ్యుడు..

పుట్టిన తేదీ, స్థలం: 1937 డిసెంబర్ 28, ముంబై (అప్పట్లో బాంబే)

విద్యాభ్యాసం: కార్నెల్ యూనివర్సిటీ (జీఆర్క్)

తల్లిదండ్రులు: నావల్ టాటా, సూనూ టాటా

పురస్కారాలు: పద్మవిభూషణ్ (2008), మహారాష్ట్ర భూషణ్ (2006), పద్మభూషణ్ (2000)



బాల్యం..విద్యాభ్యాసం..

పారిశ్రామిక దిగ్గజం, వితరణశీలి రతన్ టాటా చాలా సాధారణ జీవితం గడిపేవారు. ఆయన 1937 డిసెంబర్ 28న ముంబైలో జన్మించారు. టాటా గ్రూప్ వ్యవస్థాపకుడు జంషెడ్‌జీ టాటా కుమారుడు రతన్‌జీ టాటా దత్తత తీసుకున్న నావల్ టాటా, సూనూ టాటా ఆయన తల్లిదండ్రులు. 1948లో ఆయన తల్లిదండ్రులు విడిపోవడంతో రతన్‌జీ టాటా సతీమణి అయిన నవాజ్‌బాయ్ టాటా సంరక్షణలో పెరిగారు. జిమ్మీ టాటా ఆయనకు సోదరుడు కాగా, నోయెల్ టాటా సవతి సోదరుడు. రతన్ టాటా ముంబై, సిమ్లాలో విద్యాభ్యాసం చేశారు. అటుపైన అమెరికాలోని కార్నెల్ యూనివర్సిటీలో ఆర్కిటెక్చర్‌లో బ్యాచిలర్స్ డిగ్రీ చదివారు.

100 బిలియన్ డాలర్లకు టాటా గ్రూప్..

రతన్ టాటా 1962లో టాటా సన్స్‌లో చేరారు. సాధారణ ఉద్యోగి తరహాలోనే పని చేస్తూ కుటుంబ వ్యాపార మెళకువలు తెలుసుకోవడంలో నిమగ్నమయ్యారు. ఆర్థిక సమస్యల్లో ఉన్న నేషనల్ రేడియో అండ్ ఎలక్ట్రానిక్స్ కంపెనీ (నెల్కో)కి డైరెక్టర్ ఇంచార్జ్‌గా 1971లో ఆయన నియమితులయ్యారు. కన్జ్యూమర్ ఎలక్ట్రానిక్స్ విభాగాన్ని గాడిలో పెట్టేందుకు తీవ్రంగా శ్రమించినప్పటికీ, ఆర్థిక మందగమనం, కార్మిక సంఘాలపరమైన సమస్యల కారణంగా ఆ ప్రయత్నాలు అంతగా సఫలం కాలేదు. 1977లో సంక్షోభంలో ఉన్న మరో గ్రూప్ సంస్థ ఎంప్రెస్ మిల్స్‌కి ఆయన బదిలీ అయ్యారు. మిల్లును పునరుద్ధరించేందుకు ఆయన ప్రణాళికలు వేసినప్పటికీ మిగతా అధికారులు కలిసి రాకపోవడంతో సంస్థను అంతిమంగా మూసివేయాల్సి వచ్చింది. మొత్తానికి 1991లో జేఆర్‌డీ టాటా ఆయన్ను టాటా గ్రూప్ చైర్మన్‌గా నియమించారు. భారీ బాధ్యతలను మోయడంలో ఆయనకున్న సామర్థ్యాలపై సందేహాల కారణంగా మిగతా అధికారుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైనప్పటికీ రతన్ టాటా వాటన్నింటినీ తోసిరాజని తన సత్తా నిరూపించుకున్నారు. గ్రూప్‌ను అగ్రగామిగా నిలిపారు. తన హయాంలో మేనేజ్‌మెంట్ తీరుతెన్నులను పూర్తిగా మార్చేసి గ్రూప్ కంపెనీలను పరుగులు తీయించారు. 2012లో ఆయన టాటా గ్రూప్ చైర్మన్ పదవి నుంచి తప్పుకున్నారు. ఆ తర్వాత చైర్మన్‌గా నియమితులైన సైరస్ మిస్త్రీతో విభేదాలు రావడంతో తిరిగి 2016 అక్టోబర్ నుంచి 2017 ఫిబ్రవరి వరకు మరోసారి చైర్మన్ బాధ్యతలు చేపట్టారు. అటు తర్వాత ఎన్.చంద్రశేఖరన్‌కు పగ్గాలు అప్పగించారు. 21 సంవత్సరాల పాటు సాగిన రతన్ టాటా హయాంలో గ్రూప్ ఆదాయాలు 40 రెట్లు, లాభాలు 50 రెట్లు పెరిగాయి. టాటా గ్రూప్‌ను అంతర్జాతీయ స్థాయిలో భారీగా విస్తరించారు రతన్ టాటా. ఆయన సారథ్యంలో టాటా గ్రూప్ గ్లోబల్ బ్రాండ్‌గా ఎదిగింది. సాఫ్ట్‌వేర్, టెలికం, ఫైనాన్స్, రిటైల్ తదితర రంగాల్లోకి గ్రూప్ విస్తరించింది. రతన్ టాటా బాధ్యతలు చేపట్టినప్పుడు 1991లో కేవలం రూ. 10,000 కోట్లుగా ఉన్న గ్రూప్ టర్నోవరు 2011–12లో ఆయన తప్పుకునే సమయానికి ఏకంగా 100 బిలియన్ డాలర్లకు ఎగిసింది. సాల్ట్ నుంచి సాఫ్ట్‌వేర్ వరకు అన్ని విభాగాల్లోకి విస్తరించింది. పలు విదేశీ కంపెనీలను కొనుగోలు చేయడంతో గ్రూప్ ఆదాయాల్లో దాదాపు సగ భాగం విదేశాల నుంచే ఉంటోంది. ఆయన సాహసోపేత నిర్ణయాల కారణంగా కోరస్, జాగ్వార్ ల్యాండ్ రోవర్, టెట్లీ వంటి అంతర్జాతీయ దిగ్గజాలు టాటా గ్రూప్‌లోకి చేరాయి. నానో, ఇండికా కార్లు ఆయన విజనే.

వితరణశీలి.. ఇన్వెస్టరు..

రతన్ టాటా గొప్ప వితరణశీలి. తన సంపదలో దాదాపు 60–65 శాతం భాగాన్ని ఆయన వివిధ స్వచ్ఛంద కార్యక్రమాలకు విరాళమిచ్చారు. 2008లో కార్నెల్ వర్సిటీకి 50 మిలియన్ డాలర్ల విరాళమిచ్చారు. ప్రధానంగా విద్య, ఔషధాలు, గ్రామీణాభివృద్ధి మొదలైన విభాగాలపై దృష్టి పెట్టారు. ఆయన పలు అంకుర సంస్థల్లో విస్తృతంగా పెట్టుబడులు పెట్టారు. వ్యక్తిగత హోదాలో అలాగే ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ ద్వారా 30కి పైగా స్టార్టప్స్‌లో ఇన్వెస్ట్ చేశారు. స్నాప్‌డీల్, షావోమీ, ఓలా క్యాబ్స్, మొదలైన వాటిలో పెట్టుబడులు పెట్టారు. సీనియర్ సిటిజన్ల కోసం ఉద్దేశించిన గుడ్‌ఫెలోస్ అనే స్టార్టప్‌కు తోడ్పాటు అందించారు.

పురస్కారాలు పారిశ్రామిక దిగ్గజంగానే కాకుండా వితరణశీలిగా కూడా పేరొందిన రతన్ టాటాను పలు ప్రతిష్టాత్మక పురస్కారాలు వరించాయి. పద్మ భూషణ్, పద్మ విభూషణ్ పురస్కారాలతో పాటు ఆయన మహారాష్ట్ర భూషణ్, అస్సాం వైభవ్ వంటి అవార్డులను కూడా అందుకున్నారు.

సిమీ గ్రేవాల్‌తో అనుబంధం.. రతన్ టాటా వివాహం చేసుకోవాలనుకున్నా సాధ్యపడలేదని ఆయనే పలు సందర్భాల్లో తెలిపారు. నాలుగు సార్లు వివాహానికి దగ్గరగా వచ్చినా పలు కారణాల వల్ల వెనక్కి తగ్గాల్సి వచ్చిందని చెప్పారు. అప్పట్లో బాలీవుడ్ నటి సిమీ గ్రేవాల్‌తో ఆయన ప్రేమలో పడినట్లు వార్తలు వచ్చినప్పటికీ, ఆమె ఆ తర్వాత మరొకరిని వివాహం చేసుకున్నారు.

మిస్త్రీతో వివాదం.. టాటా గ్రూప్ చైర్మన్‌గా రతన్ టాటా ఏరి కోరి సైరస్ మిస్త్రీని తన వారసుడిగా నియమించారు. కానీ మిస్త్రీ పలు వివాదాస్పద నిర్ణయాలు తీసుకోవడంతో వారిద్దరి మధ్య తలెత్తిన విభేదాలు తారస్థాయికి చేరాయి. చివరికి 2016లో మిస్త్రీ ఉద్వాసనకు దారి తీశాయి. దీనిపై ఇరువర్గాల మధ్య సుదీర్ఘ న్యాయపోరాటం జరిగింది.

న్యూస్‌రీల్

జాతీయస్థాయి స్కేటింగ్ పోటీలకు రితిక్ ఎంపిక


జి.రితిక్ అభిమన్యురెడ్డి

ధరూరు: జాతీయస్థాయి అండర్ 11 స్కేటింగ్ పోటీలకు మండలంలోని మీర్జాపురం గ్రామానికి చెందిన జి.రితిక్ అభిమన్యురెడ్డి ఎంపికైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అక్టోబర్ 6న జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభచాటి బంగారు పతకం సాధించారని, డిసెంబర్‌లో మైసూర్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలో పాల్గొననున్నట్లు చెప్పారు.

ఆదర్శప్రాయుడు సర్దార్ సర్వాయి పాపన్న

గండేడ్: బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అందరికి ఆదర్శప్రాయుడని చేవేళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కొనియాడారు. బుధవారం మండలంలోని వెన్నాచేడ్‌లో పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణ కార్యక్రమం సంఘం అధ్యక్షుడు దత్తుగౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించగా ముఖ్య అతిథులుగా హాజరై ఆవిష్కరణ అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు. తెలంగాణలో మొఘల్‌రాజుల ప్రాబల్యం పెరుగుతున్న తరుణంలో వారి ఆధిపత్యం అంతమొందించడంతో పాటు జమీందార్లు, జాగీర్దార్ల దురాగతాలను గమనించి గోల్కొండ కోటపై బడుగుల జెండాను పాపన్నగౌడ్ ఎగురవేశారని వివరించారు. గెరిల్లా సైన్యం తయారు చేసుకొని తిరుగుబాట్లు చేసి పేదలకు బాసటగా నిలిచారన్నారు. ఆయన చరిత్రను లండన్ యూనివర్సిటీలో పొందుపర్చారని తెలిపారు. సబ్బండ వర్గాలను దృష్టిలో ఉంచుకొని పోరాటాలు చేశారని.. అలాంటి మహనీయుడి చరిత్ర తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గత, ప్రస్తుత ప్రభుత్వాలు బహుజనుల అభ్యున్నతికి పాటు పడుతున్నాయని తెలిపారు. గౌడ కులస్తుల అభ్యున్నతికి కృషి చేస్తామని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో గౌడ ఐక్యసాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు అంబాల నారాయణగౌడ్, ఐక్యసాధన సమితి విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బాలకృష్ణగౌడ్, జిల్లా అధ్యక్షుడు ఓంకార్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి, బీజేపీ ఓబీసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఈశ్వరప్ప, రాష్ట్ర నాయకుడు భూనేటి కిరణ్‌కుమార్‌గౌడ్,, పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మీనారాయణ, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గోపాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శాంతి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.


విగ్రహావిష్కరణ అనంతరం నినాదాలు చేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

నల్లమల టైగర్ ప్రాజెక్ట్‌లోని ప్రజలకు స్థల పరిశీలన

పెద్దకొత్తపల్లి: ఫారెస్ట్ అధికారుల ఆధ్వర్యంలో నల్లమల్ల టైగర్ ప్రాజెక్ట్‌లో ఉన్న గ్రామాల తరలింపులో భాగంగా నాలుగు గ్రామాల ప్రజలు బుధవారం ఫారెస్ట్ అధికారులతో కలిసి బాచారం వద్ద భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ ఐఎఫ్ఎస్ రోహిత్‌గోపిడి, డీఎఫ్ఓ గురుప్రసాద్‌షాడో ప్రజలను తీసుకొచ్చి స్వచ్ఛందంగా పునరావాస ప్రాంతాలను చూపించారు. సారపల్లి 205 కుటుంబాలు, కుండిచింతల బయలు 166 కుటుంబాలు, తాటిగుండాలు 25 కుటుంబాలు, కొల్లంపెంట 21 కుటుంబాలు, నాలుగు గ్రామాల్లో 417 కుటుంబాలున్నాయి. స్వచ్ఛంద పునరావాస కింద ఎన్‌టీసీఏ ఢిల్లీ ఆమోదించబడింది. వారికి కేంద్ర ప్రభుత్వం పునరావాసం కలిపిస్తూ జీవనోపాధి చూపించేందుకు ప్రభుత్వం భూములను అందజేస్తుందని ఫారెస్ట్ అధికారులు తెలిపారు. వటవర్లపల్లిలో 750 కుటుంబాలు రెండో విడతలో తరలిస్తామని ఫారెస్ట్ అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఎఫ్ఓ వెంకటేష్, ధర్మ, ఎఫ్‌బీఓ శిల్ప, తేజశ్రీ, రాజేశ్వరి, సుమలత, పవన్ పాల్గొన్నారు.


గ్రామస్తులతో మాట్లాడుతున్న అటవీశాఖ అధికారులు

సాంకేతిక పరిజ్ఞానంతో కేసులను ఛేదించాలి

- జోగుళాంబ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్

ఎర్రవల్లి: సాంకేతిక పరిజ్ఞానంతో కేసులను త్వరగా ఛేదించాలని జోగుళాంబ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ అన్నారు. బుధవారం ఎస్పీ తోట శ్రీనివాసరావుతో కలిసి కోదండాపురం సీఐ కార్యాలయంతో పాటు ఇటిక్యాల పోలీస్‌స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించి, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతిపై సమీక్ష నిర్వహించారు. అనంతరం డీఐజీ మాట్లాడుతూ.. వివిధ కేసులలో రిపీట్ నేరస్తులకు బెయిల్ రాకుండా చూడాలన్నారు. ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలో తరచూగా చోరీలు జరిగే ప్రాంతాలను గుర్తించి, గస్తీని ముమ్మరం చేయాలన్నారు. ఆయా ప్రాంతాల్లో ప్రజలను సమన్వయం చేసుకుంటూ.. చోరీలకు అడ్డుకట్ట వేయాలన్నారు. నేను సైతం కార్యక్రమంలో భాగంగా దుకాణ, వ్యాపార సముదాయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా చర్యలు చేపట్టాలని డీఐజీ ఆదేశించారు. ఎంసీసీ కేసులు, ప్రాపర్టీ సీజ్ కేసులలో విచారణ త్వరగా పూర్తిచేసి, కోర్టులలో చార్జ్‌షీటు వేయాలని సూచించారు. ఇతర జిల్లా, రాష్ట్రాలకు చెందిన నిందితులను సాంకేతిక పరి/జ్ఞానంతో పట్టుకోవాలని సూచించారు. ఇసుక, మొర్రం మట్టి అక్రమ రవాణా జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. జాతీయ రహదారిపై పెట్రోలింగ్‌ను మరింత పెంచాలని అలంపూర్ సీఐని ఆదేశించారు. పలు కేసులలో అరెస్ట్ పెండింగ్‌కు గల కారణాలను తెలుసుకున్నారు. సిబ్బందికి ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. వారి వెంట డీఎస్పీ సత్యనారాయణ, ఎస్పీ కార్యాలయ ఏఓ సతీష్‌కుమార్, సాయుధ దళ డీఎస్పీ నరేందర్‌రావు, సీఐ రవిబాబు, ఎస్ఐలు వెంకటేష్, స్వాతి ఉన్నారు.


పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న డీఐజీ ఎస్ఎల్ చౌహాన్

ఒకేసారి మూడు ఉద్యోగాలు..

- డీఎస్సీలో రెండు, గ్రూప్‌- 4లో ఒకటి


మనీషా

జడ్చర్ల టౌన్: డీఎస్సీలో రెండు ఉద్యోగాలతో పాటు గ్రూప్–4లో మరో ఉద్యోగానికి ఎంపికై పలువురి ప్రశంసలు పొందుతోంది జడ్చర్ల మున్సిపాలిటీలోని వెంకటేశ్వర కాలనీకి చెందిన మనీషా. పేద కుటుంబం నుంచి వచ్చిన మనీషా డీఎస్సీ పరీక్ష రాసే సమయంలో కన్నతండ్రిని కోల్పోయింది. ట్యూషన్లు చెప్పుకుంటూ అద్దె ఇంట్లో ఉంటూ బాధలోనూ డీఎస్సీ పరీక్షకు హాజరైంది. ఆమె పట్టుదలకు తగినట్లుగా గతవారం విడుదలైన ఫలితాలలో ఎస్‌జీటీ ఓపెన్ క్యాటగిరిలో, స్కూల్ అసిస్టెంట్ సోషల్ రెండింటిలోనూ ఉద్యోగం సాధించింది. అదే విధంగా గ్రూప్–4 లోనూ సెలక్ట్ అయ్యింది. మొత్తం మూడు ఉద్యోగాలు సాధించడంతో మనీషాతో పాటు తల్లి విజయమ్మ ఆనందం వ్యక్తం చేశారు. బుధవారం సాయంత్రం ఎల్‌బీ స్టేడియంలో జరిగిన కార్యక్రమానికి హాజరై నియామకపత్రం పొందేందుకు వెళ్లింది. ఈ సందర్భంగా మనీషాను పట్టణవాసులు అభినందించారు.

చొక్కన్నపల్లిలో యువకుడు..


అజయ్‌కుమార్

కల్వకుర్తి: వెల్దండ మండలం చొక్కన్నపల్లికి చెందిన టి.అజయ్‌కుమార్ మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. గతంలో కోర్టులో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగానికి ఎంపికకాగా.. ఇటీవల వెలువడిన గ్రూప్–4, డీఎస్సీ ఫలితాల్లో ఎస్జీటీ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. బుధవారం హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.


శాంతినగర్‌లోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో..


దేవరకద్రలో ..


కల్వకుర్తిలో సరస్వతీదేవిగా వాసవీమాత..


వనపర్తి జిల్లా ఆత్మకూర్‌లో..


గద్వాలలోని జములమ్మ ఆలయంలో ..


నారాయణపేట అంభాభవానీ ఆలయంలో..

చదువుల తల్లి సరస్వతిగా జగన్మాత

జగన్మాత జన్మ నక్షత్రమైన మూల నక్షత్రం రోజున చదువుల తల్లి సరస్వతీదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పలు ఆలయాల్లో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. భక్త జనుల జయజయధ్వానాల మధ్య బుధవారం ఆలయాల్లో అమ్మవారికి విశేష పంచామృతాభిషేకాలు, పుష్పార్చనలు, చండీ హోమాలు, కుంకుమార్చనలు, పుస్తకరూపిణీ సరస్వతి పూజ, తదితర కార్యక్రమాలు చేపట్టారు.

- 'సాక్షి' నెట్‌వర్క్